ఆంధ్రజ్యోతి



రైతు ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, కవిత, పల్లా, సిరికొండ తదితరులు

'టంగ్' వార్



మాటలు.. మంటలు..

- ప్రత్యర్థులే లక్ష్యంగా నోరుజారుతున్న నేతలు
- తొందరపాటుతో కొందరు.. కావాలనే మరికొందరు
- కొత్తచిక్కులు తెచ్చిపెడుతున్న విమర్శలు
- 'సినీ' దుమారం రేపిన మంత్రి కొండా సురేఖ ఆరోపణలు
- వర్గీకరణ, గుడి- బడిపై మాట జారిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- వివాదం కావటంతో అలా అనలేదంటూ సర్దిచెప్పుకొనే ప్రయత్నాలు
- రేవంత్ రుణమాఫీ చేయడని.. నాలుక కరుచుకున్న మానుకోట ఎంపీ
- మహబూబాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రసంగంలో దొర్లిన బూతు పదం
- రాజీనామా చేసి గెలవాలంటూ సొంతపార్టీ ఎమ్మెల్సీ సారయ్యకి కొండా మురళి సవాల్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లీడర్లు టంగ్ స్లిప్ అవుతున్నారు. పొరపాటున మాట్లాడుతున్నారో.. మనసులో ఉన్నవే బయట పెడుతున్నారో తెలియదు కానీ రాజకీయంగా 'మంటలు' రేపుతున్నారు. ఫైర్ బ్రాండ్ నేతలుగా పేరున్న వారు సైతం నోరు జారి చిక్కుల్లో పడుతున్నారు. ఆలోచించడం మరిచి.. ఫ్రస్టేషన్‌లో మాటల తూటాలు పేలుస్తూ ఎదుటి వారిని నొప్పిస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియాలోనూ ట్రోల్ అవుతున్నారు. ఇటీవల వరుసగా ఓరుగల్లు నేతలు తమ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. బహిరంగ సమావేశాల మొదలు విలేకరుల సమావేశాల వరకు.. పార్టీ కార్యాలయాల నుంచి అసెంబ్లీ వరకు తమ 'అదుపులేని' మాటలతో పెద్ద పెద్ద వివాదాలకే తెరతీస్తున్నారు. ఈ లీడర్ల టంగ్ స్లిప్ కాస్తా టంగ్ వార్‌గా మారడం చర్చనీయాంశమైంది.

తీవ్ర దుమారం రేపిన 'కొండా'

వరంగల్‌కు చెందిన దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేటీఆర్‌పై రాజకీయ దాడి చేసే క్రమంలో సురేఖ సినిమా హీరో నాగర్జున కుటుంబంపై చేసిన వాఖ్యలు ఇటు రాజకీయ రంగాన్ని.. అటు సినీ ఇండస్ట్రీని కుదిపేశాయి. పోలీస్ కేసులు, పరువు నష్టం దాఖలు వరకు దారి తీశాయి. అయితే సురేఖ తన వాఖ్యలను వెనుక్కి తీసుకుంటు న్నట్టు ప్రకటించారు. కానీ అప్పటికే సినీ ప్రముఖులు సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టడంతో రచ్చ పెద్దదైంది. అంతకు ముందే తన మెడలో తన సోదర సమానుడైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నూలు దండ వేసిన ఫొటోను షేర్ చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు 'కల్యాణలక్ష్మీ ఎంత ఇచ్చారు' అని అనుచిత పోస్టులు పెట్టారని సురేఖ ఆరోపించారు. ఈ ఉదంతంపై ఆమె విలేకరుల సమావేశంలో కన్నీరు కూడా పెట్టుకున్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించిన సురేఖ.. అదే ఫ్రస్టేషన్‌లో కేటీఆర్‌పై మాటల దాడి చేస్తూ అక్కినేని కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత అనుకోకుండా మాట్లాడానని, ఆ కుటుంబం బాధ పడిందని తెలుసుకుని తానూ బాధపడ్డానని వివరణ ఇచ్చారు. అయితే అప్పటికే సోషల్ మీడియాలో అక్కినేని అభిమానులు, బీఆర్ ఎస్ నేతలు మంత్రిని టార్గెట్ చేస్తూ ట్రోల్ చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం తెలుగురాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది.

తూటల్లా పేలిన నాగరాజు మాటలు..

మాజీ పోలీస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇటీవల మాట్లాడిన మాటలు ఇంకా తూటల్లా పేలుతున్నాయి. సెప్టెంబరు 30వ తేదీన ఐనవోలులో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు చేసిన వాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. 'బడి కడితే మే ధావులు పెరిగిపోతారు... గుడి కడితే బిచ్చగాళ్లు పెరిగిపోతారు' అంటూ అయన చేసిన వాఖ్యలతో ఓ వర్గం ప్రజలు మండిపడుతున్నారు. నాగరాజు రాజీనామా చేయాలంటూ బీజేపీ కేడర్ ఆందోళనలకు దిగుతున్నారు. నాగరాజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై వివరణ ఇచ్చిన నాగరాజు గుడులు కడితే బిచ్చగాళ్లు అవుతారనే పదాన్ని తాను కొందరు దొంగస్వాముల ఉద్దేశించి మాత్రమే అన్నానని తెలిపారు. తాను హిందువునని, శివుడి కంఠంలో ఉండే నాగరాజు పేరే తనకు పెట్టారని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అంతకుముందు కూడా ఓ సందర్భంలో నాగరాజు చేసిన వాఖ్యలు ఎస్సీ కులాల్లో గందరగోళానికి దారితీశాయి. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారని ఎంఆర్‌పీ ఎస్ నేతలు వారం రోజులకు పైగా ఆందోళనలు చేశారు. ఇలా వరుస ఘటనలతో ఎమ్మెల్యే నాగరాజు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

ఇలా మాట జారి.. అలా ట్రోల్ అయ్యారు

- మే 7న మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఫోను సంభాషణ లీక్ అయింది. తనకు తెలియకుండానే మేయర్‌ను పార్టీలో చేర్చుకున్నారని సురేఖ అనడం చర్చనీయాంశమైంది. మంత్రి నియోజకవర్గానికి చెందిన మేయర్‌ను మంత్రికే తెలియకుండా పార్టీలో చేర్చుకోడమేంటన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అసలు ఈఫోన్ సంభాషణను ఎవరు లీక్ చేశారనే దానిపై పార్టీలో అంతర్గత చర్చ కూడా జరిగింది.
- ఆగస్టు 13న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ సొంత పార్టీ నేత, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఓ కామెంట్ దుమారం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి, ఇంత వరకు చేయలేదని అనడంతో అక్కడున్న కాంగ్రెస్ నేతలు అవాక్కయ్యారు. అయితే నాడు రైతులకు రుణ మాఫీ చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని, రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసి చూపిస్తున్నాడని చెప్పే క్రమంలో ఎంపీ మాట దొర్లారని కాంగ్రెస్ నేతలు తరువాత సర్దిచెప్పుకోవాల్సి వచ్చింది.
- ఆగస్టు 22వ తేదీన వరంగల్ పోచమ్మ మైదాన్‌లో రోడ్డుపై ఉన్న చిరువ్యాపారుల డబ్బాలు తొలిగించగా, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై ఆయన చేసిన వాఖ్యలు దూమారం రేపాయి. తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవి కి రాజీనామా చేశానని, టీసీ నాయకుడనే చెప్పుకునే నాయకుడు కాంగ్రెస్‌లో చేరిన తరు వాత కూడా పదవికి రాజీనామా చేయటం లేదని, దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి రావాలని సవాల్ విసిరారు. ఇలా సొంత పార్టీ నేతపై కొండా మురళీ చేసిన వాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఇదే అవకాశంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేసింది.
- ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ జిల్లా అభివృద్ధిపై మాట్లాడిన మాటల్లో బూతులు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. అంతేకాదు ఈ మాటలతో ఎమ్మెల్యే సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురయ్యారు. 'సాముహిక కలెక్టరేట్లు, ప్రగతిభవన్లు, సెక్రెటరియట్లు కట్టించి మేము ఆ.. చూపిస్తున్నారు అధ్యక్షా' అంటూ అసభ్యకరంగా మాట్లాడారు. అనుకోకుండా వచ్చిన పదాలే అయినప్పటికి అసెంబ్లీ సాక్షిగా నోరు జారటంతో ఆయన విపరీతంగా ట్రోల్ అయ్యారు. వీరితో మరికొందరు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కూడా పలు సందర్భాల్లో మాటలు తూలి వివాదాస్పదంగా మారారు.

మొనగాడు కాదు.. మోసగాడు

- రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు
- ఆరు గ్యారంటీలనూ సక్రమంగా అమలు చేయలేకపోయాడు
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా
- ఎడ్లబండిపై నిరసన ర్యాలీ

7

అధికారంలోకి రాగానే పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడని, రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ సర్కారును వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్ స్పష్టం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరులో రైతు ధర్నా నిర్వహించారు. తొలుత ఎడ్లబండిపై నిరసన ర్యాలీ నిర్వహించిన నేతలు అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. అన్నదాతలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేశారని, రుణమాఫీ కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారని, కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే ఆరు గ్యారంటీల అమల్లోనూ విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ఈ నిరసనకు హాజరైన కొందరు రైతులు నేతల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. - తొర్రూరు



ఎడ్లబండిపై నిరసన ర్యాలీలో పాల్గొన్న హరీశ్‌రావు, దయాకర్ రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి తదితరులు

కాంగ్రెస్ నేత నరేశ్‌రెడ్డి కన్నుమూత

- వారం క్రితం గుండెపోటుతో హైదరాబాద్ ఆస్పత్రిలో చేరిక
- చికిత్స పొందుతూ తుదిశ్వాస
- నేడు పురుషోత్తమాయగూడెంలో అంత్యక్రియలు

వివరాలు 7లో..



నూకల నరేశ్‌రెడ్డి (ఫైల్)

తట్టుపల్లి గ్రామకార్యదర్శి ఆత్మహత్యాయత్నం

- జీపీలోనే దోమల మందును సేవించిన నాగలక్ష్మి
- జిల్లా ఆస్పత్రికి తరలింపు
- యాదగిరి అనేవ్యక్తి వేధిస్తున్నాడని కలెక్టర్‌కు లేఖ



జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న నాగలక్ష్మి

కురవి, అక్టోబరు 4 : మండలంలోని తట్టుపల్లి గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పురుషోత్తమయగూడెంకు చెందిన వంగూరి నాగలక్ష్మి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆత్మహత్యాయతానికి పాల్పడింది. విధుల్లో ఉన్న ఆమె కార్యాలయంలోనే డిజిల్ కలిపిన దోమల మందు సేవించింది. దీంతో అప్రమత్తమైన మల్టీపర్పస్ ఉద్యోగులు ఆమెను వారించి మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి తన ఆత్మహత్యాయత్నానికి ముందు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు తన మరణ వాగ్మూలం పేరిట లేఖ రాశారు. ఆ లేఖలో పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి.

తట్టుపల్లి గ్రామానికి చెందిన దొంతు యాదగిరి అనే వ్యక్తి గత సంవత్సర కాలంగా తన విధుల్లో జోక్యం చేసుకుంటూ ఆటంకపరుస్తున్నాడని పేర్కొంది. ఈ విషయాన్ని ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు తెలిపినప్పటికి పట్టించుకోలేదని లేఖలో వాపోయింది. ఓటర్ లిస్టులో అవకతవకలు జరిగాయని తనపై తరుచూ రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర మంత్రులకు, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడని తెలిపింది. తనపై యాదగిరి చేసిన ఫిర్యాదులు తప్పని అధికారుల వద్ద నిరుపించుకున్నాని

మిగతా 8వ పేజీలో..

ఏడుగురు కార్యదర్శులకు మెమోలు

గ్రామ పంచాయతీ ఎలక్షన్‌ల కోసం ఓటరు జాబితా తయారీలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకుగాను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశాల మేరకు కురవి మండలంలోని ఏడుగురు గ్రామకార్యదర్శులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో వీరబాబు శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 27న డీపీవోకు సమర్పించాల్సిన తుది ఓటరు లిస్టు జాబితాను సమర్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను బంగారుగూడెం, తట్టుపల్లి, నేరడ, బాల్యతండా, కాకులబోడుతండా, గుండ్రాతిమడుగు, ఎలకచెట్టు తండా జీపీ కార్యదర్శులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఎంపీ బలరాంనాయక్‌కు కాళోజీ వాకర్స్ విజ్ఞప్తి



ఎంపీ బలరాంనాయక్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు4 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, అధ్యక్షుడు నామిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ పట్టణంలో ఎంపీ బలరాంనాయక్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లు మానుకోట అని ఈ ప్రాంతం నుంచి ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగి క్రీడాచరిత్రను విశ్వవ్యాప్తం చేశారని మానుకోటలో అన్నిహంగులతో క్రీడా స్టేడియాన్ని నిర్మించాలని కోరారు. ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతీ నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం చేసేందుకు వస్తుంటారని స్టేడియం అభివృద్ధికి నిధులు వెచ్చించాలని కోరారు. స్పందించిన ఎంపీ ఎన్టీఆర్‌స్టేడియం అభివృద్ధికి నిధులు మంజూరీ చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మైసశ్రీనివాస్, సోమ విష్ణువర్ధన్, రాచకొండ ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆవునూరి రవి, కాసీం, మేడ వెంకటేశర్లు, రాచకట్ల రవి, గంధసిరి మురళీ, పూజారి వెంకటేశ్వర్లు, మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్ రోడ్లు, వంతెనలు, భవనాలు, అమ్మఆదర్శ పాఠశాలల పనులు, గిరిజన సంక్షేమశాఖకు సంబంధించిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. అమ్మఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, బాలికలకు ప్ర త్యేక మరుగుదొడ్ల నిర్మాణం,అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు,పెయింటింగ్స్ తదితర పనులను పూర్తి చేయాలన్నారు. అన్నివిభాగాల అభివృద్ధి పనులు పూర్తిచేసి నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సీసీఐ సూచనల మేరకు జిల్లాలో ఆరు జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, ఆ కేంద్రాలను తనిఖీ చేసి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, ఎం. డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, అధికారులు బీమ్లానాయక్, విద్యాసాగర్, వీరభద్రం, నరేందర్, వెంకటేశ్వర్లు, విజయనిర్మల పాల్గొన్నారు.

మిర్చి సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

8లో..

- రైతులకు డాక్టర్ సీహెచ్ సింగ్ సూచన



రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో దుర్గామాత

రూ.21,21,021 దేశ, విదేశీ కరెన్సీనోట్లు, నాణేలతో అలంకరణ



మహబూబాబాద్ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను కరెన్సీనోట్లు, నాణేలతో అలంకరించిన దృశ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4 : దుర్గ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవా రం శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శ్రీవాసవీ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను రూ.21,21,021ల దేశవిదేశీ కరెన్సీ, కాయిన్స్‌తో అలంకరించారు. రూ.1కరెన్సీ నోటు నుంచి రూ.500 నోట్లతో అలంకరించడంతో పాటు విదేశీ కరెన్సీలు ఉన్నాయి. రూ.లక్ష కాయిన్, పదివేలు, ఐదువేలు, వెయ్యి, ఐదు వందలు, మూడు వందల యాభై, ఇరువై, పది రూపాయల కాయిన్‌లను కూడా అలంకరణకు ఉపయోగించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు చౌడవరపు మోహన్‌రావు, మంజువాణి, ఇమ్మడి రవికుమార్, గీతారాణి, శ్రీరంగ కిషోర్, సుభాషిణి, చౌడవరపు సుజాత పాల్గొన్నారు.

వచ్చే నెల 4 నుంచి
ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 4: కేయూప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నవంబరు 4వ తేదీ నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం తెలిపారు. నవంబరు 4న శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ మొదటి పేపర్-1, అలాగే నవంబరు 8న ఎలక్టివ్ పేపర్-2లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, ఎడ్యుకేషన్ విభాగాల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

కాజీపేట మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, అక్టోబరు 4: కాజీపేట- దాదర్, దాదర్ - కాజీపేటల మధ్య దసరా ప్రత్యేక రైళ్లు నడవనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. 07195 కాజీపేట - దాదర్ అక్టోబరు 16, 23, నవంబర్ 13, 20, 27 తేదీల్లో కాజీపేట నుంచి ప్రతీ బుధవారం 15.00 గంటలకు బయలు దేరి గురువారం 13.25 నిమిషాలకు చేరుకుంటుంది. 07196 దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 17, 24, నవంబర్ 14, 21, 28, తేదీల్లో దాదర్‌లో ప్రతీ గురువారం 15.25 నిమిషాలకు బయలుదేరి శుక్రవారం 16 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 07197 కాజీపేట-దాదర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటలో అక్టోబరు 12, 19, 26 నవంబర్ 2, 11, 16, 23, 30 ప్రతీ శనివారం 11.30నిమిషాలకు బయలుదేరి ఆదివారం 13.25కు చేరుకుంటుంది. (07198) దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 13, 20, 27 నవంబరు 3, 10, 24, 27 డిసెంబరు 1వ తేదీన దాదర్‌లో ప్రతీ ఆదివారం 15.25నిమిషాలకు బయలుదేరి సోమవా రం కాజీపేటకు 21.30 నిమి షాలకు చేరుకుంటుంది. ఈ రైలుకు జమ్మికుంట, పెద్దపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, బందర్, వాని, కయర్, లింగ్‌టీ, పింపల్క్‌హాటి, ఆదిలాబాద్, కిన్‌వేట్, సమస్రఖండ్, హిమయత్‌నగర్, బోకర్, మెద్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్భానీ, పెలు, పర్తున్, జల్నా, ఔరంగబాద్, లానూర్, రోటేగాం, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగ్‌టాపూరి, కళ్యాన్, రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చారు.

కొనసాగుతున్న డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్


వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు 1:3 మెరిట్ ప్రాతిపదికన వెరిఫికేషన్ కొనసాగుతోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారంతో రెండోరోజుకు చేరుకుంది. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, శనివారంతో వెరిఫికేషన్ ప్రక్రియ ముగియనుంది.

ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ చేయడం అన్యాయం

న్యూశాయంపేట, అక్టోబర్4: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయడం అన్యాయమని, ఇది మాదిగలకు ద్రోహం చేయడమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ అన్నారు. శుక్రవారం న్యూశాయంపేటలో ఏర్పాటుచేసిన ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో నరేష్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామన్నారు. ఈ నిరసనకు ఎంఆర్‌పీఎస్ నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

మానుకోట కాంగ్రెస్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

● వారం కిందట గుండెపోటు.. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
నేడు పురుషోత్తమాయగూడెంలో అంత్యక్రియలు



మరిపెడ, అక్టోబరు 4: కాంగ్రెస్ సీనియర్ నేత, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నూకల నరేశ్‌రెడ్డి(74) శుక్రవారం కన్నుమూశారు. వారం రోజుల కిందట ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో అభిమానులు శోకసముద్రంలో మునిగిపోయారు. వారం కిందట హైదరాబాద్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు వైద్యులు స్టెంట్ వేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు, మాజీ మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆస్పత్రికి వెళ్లి నరేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అయితే నరేశ్‌రెడ్డికి డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. శుక్రవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. నూకల నరేశ్‌రెడ్డి జీవితం ఓ తెరిచిన పుస్తకం. మేనమామ రామసహాయం సురేందర్‌రెడ్డి ద్వారా రాజకీయ వారసత్వం అందుకున్న ఆయన నాటి నుంచి నేటి వరకు కాలం తో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రాజకీయంగా అనేక పదవులు అందనట్టే అంది చేజారిపోయాయి. అయినా ఎన్నడూ నిరాశ చెందని ఆయనకు ఎలాంటి పరిస్థితుల్లో అయినా తనను నమ్మినోళ్లకు అండగా ఉన్నారన్న పేరుంది. నరేశ్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకురానుండగా.. శనివారం పురుషోత్తమయాగూడెంలోని వ్యవసాయ క్షేత్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంత్యక్రియలకు భారీగా జనం తరలొచ్చే అవకాశం ఉండటంతో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. నరేశ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం రాత్రి పరిశీలించారు.

రాజకీయ ప్రస్థానమిలా..

1989 అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ కాంగ్రెస్ బీఫామ్ ఆయనకే ఖరారైనా కొందరి మోసపూరిత మాటలకు బలియై పోటీకి దూరమయ్యారు. 1994లో డోర్నకల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో టీడీపీలో చేరిన ఆయన 1999ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో రెడ్యానాయక్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్మన్ పదవిని ఆశించిన నరేశ్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేయూతతో రాయపర్తి జడ్పీటీసీగా గెలిచారు. జడ్పీ చైర్మన్ కోసం గట్టిపోటీ ఇచ్చారు. 2012లో తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై అప్పటి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాతి పరిణామాల్లో 2024లో మళ్లీ సొంతగూడైన కాంగ్రెస్‌లో చేరి.. ఎంపీ బలరాంనాయక్ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. అంతేకాదు ఆయనకు ఖమ్మం జిల్లాతోనూ ఎంతో రాజకీయ అనుబంధం ఉంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నరేశ్‌రెడ్డి టీఆర్‌ఎస్ తరపున ఆ జిల్లా ఇన్‌చార్జ్‌గా పని చేశారు. పాలేరు ఉపఎన్నికల్లో తుమ్మల గెలుపులో తనవంతు పాత్ర పోషించారు. 2018 ఎన్నికల్లోనూ మరోసారి ఇన్‌చార్జిగా పనిచేశారు. 2020ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేశారు.

ఆటోడ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సుల అందజేత



ఆటోడ్రైవర్స్‌కు లైసెన్సును అందజేస్తున్న సీపీ

హనుమకొండ టౌన్, అక్టోబర్ 4: డ్రైవింగ్ లైసెన్స్ లేని 35 మంది డ్రైవర్లకు సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు. కొద్ది రోజుల కిందట ట్రైసిటీ పరిధిలోని ఆటోడ్రైవర్స్‌కు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటోడ్రైవర్స్‌కు తాను చొరవ తీసుకొని లైసెన్స్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సీపీ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంగా డ్రైవర్స్‌నుంచి కావాల్సిన దస్త్రాలను తీసుకొని లైసెన్స్‌లను మంజూరు చేశారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సమక్షంలో ఆయా డ్రైవర్స్‌కు సీపీ లైసెన్స్‌లను అందజేశారు. రానున్న రోజుల్లో హనుమకొండ, వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డ్రైవర్లకు సైతం లైసెన్స్‌లు ఇప్పిస్తామన్నారు. కాజీపేటలో లైసెన్స్‌లు ఇప్పించడానికి కృషిచేసిన సీఐ నాగబాబు, ఎస్సై ఉమాకాంత్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

బీజేపీ డ్రామాలకు రైతులు మోసపోవద్దు

- రుణమాఫీపై ధర్నాలు చేయడానికి ఆ పార్టీ నాయకులకు సిగ్గుండాలి
- మూసీ నది ప్రక్షాళనలో ప్రతిపక్షాల తీరు సిగ్గుచేటు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 4: రైతులకు ఏనాడూ రుణమాఫీ చేయని బీజేపీ వాళ్లు ఇప్పుడు రుణమాఫీ విషయంలో ధర్నాల పేరుతో డ్రామాలు చేస్తున్నారని, ఆ డ్రామాలను నమ్మి రైతులు మోసపోవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఇప్పటికే 23లక్షల మందికి రుణమాఫీ వర్తింపజేశామని, దాదాపు రూ.18వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యా యన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న విధానాల ప్రకారం 42లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయబోతున్నామని అందుకుగాను రూ.31వేల కోట్ల ఖర్చు చేయబోతున్నామని వివరించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వస్తుందని, రైతులు ప్రతిపక్షాల మాటాలు పట్టించుకోవద్దన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కడా కూడ ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణామాఫీ చేసిన చరిత్ర లేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతుల రుణమాఫీ ఏనాడు చేయలేదని, కనీసం రుణమాఫీ చేస్తున్న రాష్ట్రాలకు ఆర్థిక చేయూత కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. రైతులకు ఏమీ చేయని బీజేపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని, వారికి రైతులపై ప్రేమ ఉంటే కేంద్రాన్ని ఒప్పించి దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ ప్రకటించాలన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు నరేంద్రమోదీని ప్రశ్నించే ధైర్యం లేదని బీజేపీ అంటేనే రైతు, దళిత, తెలంగాణ వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. మూసీనది ప్రక్షాళన విషయమై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నాయని, మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలు సుమారు 1000 మంది స్వచ్ఛందంగా వెళ్లిపోగా వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, దీనిపై సీఎం ఓ స్పష్టమైన విధానంతో ఉన్నారన్నారు. కానీ స్వచ్ఛందంగా వెళ్లిపోయే వారిని వెళ్లిపోకుండా మీరు ఈ మురికిలోనే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అన్నారు. పేదల ఓట్లతోనే గెలిచిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. పేదలను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేయదన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, గడ్డమీది సురేష్, అన్నం బ్రహ్మరెడ్డి, డాక్టర్ అంబటి కిషన్‌రాజ్, తెల్లాకుల రామకృష్ణ, చాడ రాజ్‌కుమార్, గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, కోతి రాములు, ఇనుగాల రాజిరెడ్డి, ఎడ్ల వెంకటస్వామి, బత్తిని అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొనగాడు కాదు.. మోసగాడు..

రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు

సీఎం రేవంత్‌పై మాజీమంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్

తొర్రూరులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా



తొర్రూరు సభా వేదికలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, అక్టోబరు 4 : సీఎం రేవంత్‌రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడని, అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తానంటూ తొలి సంతకం చేసి రైతులను మోసగించాడని బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్ మండిపడ్డారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు, నేతలు ఎడ్లబండిపై నిరసన ర్యాలీ నిర్వహించి.. అనంతరం విశ్రాంతి భవనం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత హరీశ్‌రావు మాట్లాడారు. అన్నదాతలకు కల్లబొల్లి మాటలు చెప్పి వారిని మోసం చేశారని, రుణమాఫీ చేసేవరకు కాంగ్రెస్ సర్కారును వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 30 శాతం కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రుణమాఫీ, రైతు భరో సా, రైతుబంధు, పంటలకు బోనస్, అర్హులైన మహిళలకు రూ.2500 భృతి, పెన్షన్‌లు పెంపు లాంటి హామీలను అమలుపర్చకుండా మోసం చేస్తున్నారని, ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. ఆగ స్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మొదట రూ.49 వేల కోట్లు, ఆ తర్వాత రూ.31 వేల కోట్లు చివరకు మాఫీ చేసింది రూ.17వేల కోట్లు మాత్రమే అన్నారు. తొర్రూరు మండలంలో 11 వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే 5 వేల మందికి మాఫీ అయిందని, మిగతా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని యాదాద్రి, భద్రాద్రి, కొమురెల్లి, సమ్మక్క-సారలమ్మలపై సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టు వేసి, మాఫీ చేస్తానని మోసం చేశాడని అన్నారు. రేవంత్‌రెడ్డి తన శిష్యుడే కానీ, బ్రోకర్ మాటలు చెపుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి రైతులను మోసగిస్తున్న ఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగలేదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కూల్చుడు తప్ప కట్టుడు తెలువదన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో కష్టపడి సంపాదించుకున్న ఇండ్లను కూలగొడుతున్నారని, మూసీ శుద్ధిపేరుతో మరో కుంభకోణానికి తెర లేపారన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

తొర్రూరులో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ రైతు ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మాజీ మంత్రుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. వారిని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ రుణం ఎంత ఉంది. భూమి ఎన్నిఎకరాలు ఉంది రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెపుతున్నారు లాంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాకుండా రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని, రైతుల గోడు పట్టించుకోవాలన్నారు. దసరా వరకు రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. పంట కోతకు వచ్చిందని, రైతుబంధు, రైతు భరోసా పడలేదని కేసీఆర్ ఉన్నపుడు రైతుబంధు వచ్చేదని రైతులు తమ గోడును వారికి వెల్లగక్కారు. ఏది ఏమైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టాలని, అప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనకు హాజరైన రైతులు, కార్యకర్తలు

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల ఇద్దరి అరెస్ట్, చోరీ సొత్తు వివరాలు చెబుతున్న రైల్వే సీఐలు

గిర్మాజీపేట, అక్టోబరు 4: సింహపురి ఎక్స్ ప్రెస్‌లో చోరీకి పాల్పడిన గొడుగు నవీన్ (21), గుగులోతు నరేష్(25)లను శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీ నం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. వరంగల్ జీఆర్‌పీలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ మాట్లాడారు. గతనెల 13న గూడూరు నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలు నిద్రలో ఉండగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్‌పీలో ఫిర్యాదు చేసింది. దీంతో గత నెల 26న వరంగల్ జీఆర్‌పీ బదిలీ అయిందన్నారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో భాగంగా జీఆర్‌పీ సిబ్బంది శుక్రవా రం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల తనిఖీ చేపట్టామన్నారు. ప్లాట్‌ఫాం2, ప్లాట్‌ఫాం3 ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీచేయగా వారి వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో గొడుగు నవీన్ (గార్ల- మహబూబాబాద్ జిల్లా), గుగులోతు నరేష్ (రాజుల పాలెం -ఖమ్మం జిల్లా) నెల 13న సికింద్రాబాద్ వెళ్తున్న సింహపురిలో ప్రయాణికురాలికి చెందిన బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు వారు అంగీకరించారని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుల నుంచి రూ.3.50లక్షల విలువైన బంగారు నెక్లెస్, రెండు బంగారు గాజులు, ఒక వెండి గ్లాస్, రెండు వెండి కుంకుమ భరిణెలు స్వాధీనం చేసుకుని కాజీపేట రైల్వేకోర్టు ద్వారా రిమాండ్ చేసినట్లు సీఐ తెలి పారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ టి.ఎస్.ఆర్. కృష్ణ, జీఆర్‌పీ ఎస్సై మోహినుద్దీన్ పాల్గొన్నారు.

గౌడన్నలకు అభయ హస్తం.. కాటమయ్య రక్షణ కవచం

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్


గీత కార్మికులకు రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్న రాంచంద్రునాయక్, బలరాంనాయక్

మరిపెడ, అక్టోబరు 4 : గౌడన్నలకు అభయ హస్తం.. కాటమయ్య రక్షణ కవచమని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం డోర్నకల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 120 మందికి కాటమయ్య రక్షణ కిట్లను ఎంపీ, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గౌడన్నల రక్షణ కోసం ప్రత్యేక కవచ కిట్లను రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నట్లు గుర్తు చేశారు. పేదల అభివృద్ధియే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కారు పని చేస్తుందన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నర్సింహమూర్తి, మహబూబాబాద్, తొర్రూరు ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, తిరుపతి, మాజీ జడ్పీటీసీ అంబటి వీరభద్రం, మరిపెడ మాజీ సర్పంచ్ రాంలాల్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలిమల్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, బట్టునాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు గురుకుల, బీఎడ్ టీచర్ పోస్టుల భర్తీకి ఆయా సంఘాల బాధ్యులు వినతి పత్రం ఇచ్చారు.

దుర్గాదేవికి పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మరిపెడ మండల్ పరిషత్ సభా వేదికపై ఏర్పాటు చేసిన దుర్గాదేవికి డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట తాజుద్దీన్, ఐలిమల్లు, తల్లాడ వెంకట్రామ రావు, నర్సింహరెడ్డి, అల్వాల ఉపేందర్, గుండాగాని వేణు, రవికాంత్, రవి, సత్యనారాయణ, మచ్చా వెంకట్‌నర్సు, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో పీడీఎస్‌యూ విప్లవ చైతన్యాన్ని నింపింది

● ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు బూర్గుల ప్రదీప్



అర్ధశతాబ్దోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రదీప్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4 : విద్యార్థుల్లో విప్లవ చైతన్యాన్ని నింపిన సంఘం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) అని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు, పీడీఎస్‌యూ వ్యవస్థాపక సభ్యుడు బూర్గుల ప్రదీప్ అన్నారు. మహబూబాబాద్‌లోని గిరిజన భవన్‌లో శుక్రవారం సంఘం 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సభను సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బలాష్టి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం, సమసమాజం స్థాపన, నూతన ప్రజాస్వామ్య విప్లవం లాంటి ఉన్నత ఆశయాలతో ఏర్పడిన సంఘం పీడీఎస్‌యూ అని పేర్కొన్నారు. 50 ఏండ్ల విప్లవ ప్రస్థానంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే విద్యాప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడిందని తెలిపారు. సంప్రదాయ, సంస్కరణవాద విద్యార్థి సంఘాల్లో విప్లవ చైతన్యాన్ని అందించిన సంఘం పీడీఎస్‌యూ అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం సమరశీల పోరాటాలు నిర్వహిస్తూనే సమాజం కోసం సాగే పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

పీడీఎస్‌యూ మాజీ నాయకుడు గోవర్దన్ మాట్లాడుతూ విప్లవ ప్రస్థానంలో అనేకమంది సంఘం నాయకులు పిడికిలి ఎత్తి ప్రాణాలు తృణప్రాయంగా అర్పించారని తెలిపారు. కామ్రేడ్ జార్జిరెడ్డి మతోన్మాద శక్తులదాడిలో ఉస్మానియా యూనివర్సిటీలో నేలకొరిగారని పేర్కొన్నారు. కామ్రేడ్ జంపాల చంద్రశేఖరప్రసాద్, శ్రీపాదశ్రీహరి నేతృత్వంలో పాలకుల దోపిడిపై పోరాడి వారి తూటాలకు సంఘం నేతలు అర్పించారని తెలిపారు. అందరికి సమానమైన, శాస్త్రీయమైన విద్యకోసం, సమాన అవకాశాల కోసం సమరశీల పోరాటాలను నిర్వహించాలన్నారు. విద్యార్థులంతా సమసమాజ స్థాపన కోసం పోరు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మోప శ్రీనివాస్, చుంచు శ్రీశైలం, మండల వెంకన్న, గౌని ఐలయ్య, బండారు ఐలయ్య, భువనగిరి మధు, నాగరాజు, హరీష్, కొమిరె సాకి, మామిడాల సత్యనారాయణ, రాకేష్, నారాయణ, జనార్దన్‌రాజు, విష్ణువర్దన్, ఐలయ్య, లింగన్న, శ్రీనివాస్, సాగర్, తేళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● బయ్యారం ఎస్‌ఐ తిరుపతి


నిరుద్యోగ యువతతో మాట్లాడుతున్న తిరుపతి

బయ్యారం, అక్టోబరు 4 : నిరుద్యోగంతోబాధపడుతున్న యువత జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించే జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఎస్‌ఐ కోగిల తిరుపతి పిలుపునిచ్చారు. జాబ్ మేళా విజయవంతం కోసం ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ నిరుద్యోగ యువతకు ప్రేరణ కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ నేతృత్వంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టే జాబ్‌మేళాలో వివిధ సంస్థలకు 40 ప్రైవేటు కంపెనీల ప్రతినిధు లు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపిన ఎస్‌ఐ నిరుద్యోగ యువత తమ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

క్రీడల్లో అటవీశాఖ ఉద్యోగుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న డీఎఫ్‌వో విశాల్

గూడూరు, అక్టోబరు 4 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 29, 30 తేదీల్లో జరిగిన జోనల్‌స్థాయి క్రీడల్లో మహబూబాబాద్ జిల్లా అటవీ శాఖ ఉద్యోగులు ఆయా క్రీడల్లో ప్రతిభ చాటారు. వారం రోజుల ముందుగానే డీఎఫ్‌వో బత్తుల విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో సురేష్‌లు అటవీశాఖ ఉద్యోగులకు ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన వివిధ క్రీడల్లో మహబూబాబాద్ జిల్లా వివిధ రేంజ్‌ల పరిధిలో పనిచేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు క్రీడానైపుణ్యాన్ని చాటారు. షాట్‌పుట్, వెయిట్‌లిఫ్టింగ్, రన్నింగ్, వాకింగ్, పవర్‌లిఫ్టింగ్, లాంగ్‌జంప్, రైఫిల్‌షూటింగ్, డిస్కర్స్ త్రో, జావలిన్ త్రో, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్‌లాంటి క్రీడల పోటీల్లో మహిళలు, పురుషుల విభాగాల్లో అత్యధిక బహుమతులను మానుకోట జిల్లా జట్లు గెలుచుకున్నాయి. క్రీడల్లో విజేతలుగా నిలిచిన అటవీశాఖ ఉద్యోగులను డీఎఫ్ విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో సురేష్ అభినందించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను హైదరాబాద్ దూలపల్లిలో జరిగే క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు.

మిర్చి సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

● రైతులకు డాక్టర్ సీహెచ్ సింగ్ సూచన

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 4 : మిర్చి సాగులో మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని బెంగళూరు భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్.సింగ్ రైతులకు సూచించారు. మల్యాల రైతు వేదికలో శుక్రవారం భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ, శ్రీకొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంస్థ, జేవీఆర్ రిసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక సౌజన్యంతో రైతులకు మిరప సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. జేవీఆర్ ఉద్యాన పరిశోధన సంస్థ అధినేత నాగరాజు మాట్లాడుతూ రైతులు వివిధ రకాల పంటల సాగు కోసం అవసరమైన సాంకేతిక సలహాలు ఇవ్వడానికి జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సూక్ష్మ పోషక మిశ్రమాలు, వేప కషాయం పొడి, జీవన ఎరువులను, విత్తనాలను రైతులకు శాస్త్రవేత్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పొన్నం నరేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, శాస్త్రవేత్తలు రాంబాబు, ఏఈవో సరిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

● 798 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

● జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4 : జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో శుక్రవారం నాలుగో రోజు నాటికి 798 మంది డీఎస్సీ సర్టిఫికెట్లు పరిశీలించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్, తెలుగు, హిందీ పండిట్, వ్యాయామ ఉపాధ్యాయుల 381 పోస్టులకు 1:3 నిష్పత్తితో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తుండగా, నాలుగో రోజు నాటికి 798 మంది హాజరైనట్లు ఆయన వివరించారు. ఇంకా 162 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉందన్నారు. మిగిలిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని, అభ్యర్థులు నిర్ణీత సమయంలో హాజరు కావాలని సూచించారు. ఈ పరిశీలన కేంద్రాలను ఏసీజీఈ మందుల శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, సూపరిండెంట్ ఉమామహేశ్వర్, కో-ఆర్డినేటర్లు ఆజాద్ చంద్రశేఖర్, విజయకుమారి, సంతోష్, షాబీర్ అలీ, హరిత, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు : 97036 02011, 70939 58455లను సంప్రదించాలన్నారు.

మార్కెట్ కూలీలకు కూలి రేట్లు పెంచాలి

● ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగన్న

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 4 : వ్యవసాయ మార్కెట్లో పని చేస్తున్న కూలీలకు కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ అనుబంధ ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎదుట కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ హమాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మార్కెట్‌లలో పని చేస్తున్న కూలీలకు కూలీ రేట్లు పెంచకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గొడుగు గుట్టయ్య, జనార్ధన్, వినయ్, ప్రవీణ్, బాలు, కాంతమ్మ, నాగమ్మ, హరి, లచ్చు, మన్ని, రాణి, మరియమ్మ, కాంతి, రాజేశ్వరి, శ్రీను పాల్గొన్నారు.

తట్టుపల్లి గ్రామకార్యదర్శి ఆత్మహత్యాయత్నం

(5వ పేజీ తరువాయి)

లేఖలో తెలిపారు. సెప్టెంబర్ 27న డీపీవో కార్యాలయానికి సమర్పించాల్సిన ఓటరు లిస్టు మరుసటి రోజు డీపీవోకు చేరాయనే కారణంతో కురవి ఎంపీడీవో తనకు షోకాజ్ నోటీస్ ఇచ్చాడని లేఖలో పేర్కొంది. తన షోకాజ్ నోటీసును దొంతు యాదగిరి తట్టుపల్లి గ్రామ సోషల్ మీడియాలో పెట్టితనను మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడని తెలిపింది. యాదగిరి పెట్టే బాధలను ఓర్చుకునే శక్తి ఇకపై తనకు లేదని, తనపై జరుగుతున్న వేధింపులకు తన చావుతోనైనా పరిష్కారం దొరుకుతుందని యాదగిరిపై చర్యలు తీసుకుని తన ఆత్మకు శాంతి చేకూర్చాలని లేఖలో కలెక్టర్‌ను కోరింది. కాగా, నాగలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలుసుకున్న ఎంపీడీవో వీరబాబు, ఎంపీవో గౌస్ జిల్లా అస్పత్రికి వెళ్లి ఆమె మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులతో మాట్లాడారు.

నూకల నరేష్‌రెడ్డి మృతికి సంతాపం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నూకల నరేష్‌రెడ్డి గుండెపోటుతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందడం బాధకరమని మాజీఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ ఒక ప్రకటనలో అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, సామాజిక స్పృహ కలిగిన గొప్ప రాజకీయ నాయకుడు నరేష్‌రెడ్డి అని, ఆయన ఆకస్మిక మరణ బాధకలిగిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. నరేష్‌రెడ్డి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

జిల్లా ఇంజనీరింగ్ కన్సల్టెంట్ జిల్లా అధ్యక్షుడిగా భన్సీలాల్



గూడూరు, అక్టోబరు 4 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీపథకం ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా దారవత్ భన్సీలాల్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా డి.ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బిందు, కోశాధికారి చెన్నూరి నరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను మరి కొంతమందిని ఎన్నుకున్నారు.



మార్కెట్లో ప్రత్యేక హోదా కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న వెంకన్న

బీమా సౌకర్యం కల్పించాలని ధర్నా

కేసముద్రం, అక్టోబరు 4 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె వెంకన్న మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ బీమా సౌకర్యం కల్పిస్తే కార్మికులు ప్రమాదాలకు గురైన సమయంలో వారి కుటుంబాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక హోదా కార్యదర్శి ఆమరలింగేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ధరావత్ రమేష్, వేల్పుల వెంకన్న, నేరడ వీరస్వామి, గుగులోతు రాజు, కరుణాకర్, కనకన్న, లచ్చన్న, ధరావత్ వీరన్న, పి.వెంకన్న పాల్గొన్నారు.

ఉదయ్‌చందర్ కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 4 : మహబూబాబాద్ పట్టణంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ కుటుంబాన్ని శుక్రవారం డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పరామర్శించారు. మానుకోటలో ఇటీవల గుండె పోటుతో మృతిచెందిన చుక్కల ఉదయ్‌చందర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, గుగులోతు వెంకట్, కామ సంజీవరావు, యాకూబ్, బండి శ్రీను, కృష్ణ, ఆరెందుల వెంకటేశ్వర్లు, అంబటి వీరభద్రం, ఇనుగుర్తి సుధాకర్, బెల్లంకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత మానుకోటలో ఉదయ్‌చందర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, షేక్. మహబూబ్‌పాషా ఉన్నారు.

బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 4 : అయోధ్య గ్రామ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ కోల సత్యం శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోల సత్యంతో పాటు హెచ్.వెంకటేష్ మరికొంత మందికి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు4 : ఆధునిక వ్యవసాయం, గ్రామ సాంఘిక కార్యాలయాలు, ఉపయోగంపై విద్యార్థులు చిత్రపటంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం వరంగల్ వ్యవసాయ కళాశాల, మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగాకంబాలపల్లిలోని రైతు వేదికలో గ్రామీణా వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణా భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. కంబాలపల్లికి చెందిన వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాలు, సేంద్రీయ వ్యవసాయంపై, గ్రామంలో జరిగిన అభివృద్ధిపై కళాశాల విద్యార్థులు సామాజిక మ్యాప్‌లు, వెన్ డయాగ్రామ్, సీజనల్ క్యాలెండర్, కాల క్రమం, టైమ్‌లైన్‌ను రైతు వేదికలో గీసి రైతులకు, ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంతోష్‌కుమార్, అర్చన, స్వాతి, ఏఈవో రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి


కొత్తగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై కుశకుమార్, యువకులు

కొత్తగూడ, అక్టోబరు 4 : మహబూబాబాద్‌లో ఈనెల 8న నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని ఎస్సై కుశకుమార్ సూచించారు. జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తు కొత్తగూడలో శుక్రవారం యువకులతో కలిసి ఎస్సై కుశకుమార్ ర్యాలీ నిర్వహించారు.

'పోపా' ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార్

తొర్రూరు, అక్టోబరు 4 : పద్మశాలి ఆఫీషియల్ ప్రొఫెషనల్స్ (పోపా) ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామని ఆ సంఘం నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం తొర్రూరు లో వారు మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల్లో పదో తరగతి నుంచి పీజీ వరకు 2024 సంవత్సరంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈనెల 11న తొర్రూరులోని వం దేమాతరం ఫౌండేషన్‌లో అవార్డులు అందజేస్తారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు తమ మార్కుల మెమో, ఇతర వివరాలు ఈనెల 9వ తేదీ వరకు ఫోన్ 94416 70810, 9441055082 నంబర్లకు తెలపాలన్నారు.

'పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే'


కందికొండలో ర్యాలీలో మాట్లాడుతున్న ఆకుల రాజు

కురవి, అక్టోబరు 4 : నిరుపేదల హక్కుల కోసం చివరి వరకు పోరాడేది కమ్యూనిస్టు పార్టీలు మాత్రమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. కందికొండ సీపీఎం గ్రామ మహాసభలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ మహాసభల్లో వంగూరి వీరయ్య అరుణ పతకాన్ని ఎగురవేశారు. గ్రామశాఖకార్యదర్శిగా కొర్ని రాములును ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నల్లపు సుధాకర్, కట్ల కృష్ణ, పోతుగంటి మల్లయ్య, మాలోతు కిషన్, కొర్ని మల్లమ్మ, అనిల్, ఉప్పలయ్య, శ్రీను పాల్గొన్నారు.

బయ్యారం ఎంపీడీవోగా విజయలక్ష్మి

బయ్యారం, అక్టోబరు 4 : బయ్యారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గార్ల ఎంపీవోగా పనిచేసిన ఆమె పదోన్నతితో బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ దైవాదీనం బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా విధుల్లో చేరిన విజయలక్ష్మికి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణభాను, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థినులు

డోర్నకల్, అక్టోబరు 4 : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు డోర్నకల్ మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చావ కృష్ణభాను శుక్రవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్ -17 విభాగంలో ఆర్.షణ్ముఖప్రియ, ఈ.దీపిక, పి.గీతికలుఉమ్మడి వరంగల్‌లో జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. అక్టోబరు 6,7,8 తేదీల్లో మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల పీడీ గోవర్ధన్, వీరబాబు, ఆధ్యాపకులు వారిని అభినందించి రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడలతో స్నేహభావం : సీఐ

తొర్రూరు రూరల్, అక్టోబరు 4 : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సీఐ జగదీశ్ అన్నారు. వెల్లికట్టెలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలు వెల్లికట్టె ప్రీమియం లీగ్-20204ను గురువారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోనైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉంటారని, వెలికి తీసి గుర్తించడానికి ఇలాంటి పోటీలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. తొలుత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన క్రీడాకారుడు, తొర్రూరు కానిస్టేబుల్ డి.విజేందర్ మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. ఎస్సై జి.సతీష్, నిర్వాహకులు పోసాని సంతోష్, దీకొండ బాలరాజు, వీరమనేని రాజు, పోసాని అనిల్, రమేష్, వంశీ, సుధాకర్ పాల్గొన్నారు.


వెల్లికట్టెలో క్రికెట్ పోటీలను ప్రారంభించి, మాట్లాడుతున్న సీఐ జగదీశ్

'ఝాన్సీరెడ్డి కోలుకోవాలి'

తొర్రూరు రూరల్, అక్టోబరు 4 : పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని తొర్రూరు మండలం మడిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు స్థానిక గడిమైసమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో గాయపడిన ఝాన్సీరెడ్డికి కాలు విరగడంతో త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని గ్రామ పార్టీ అధ్యక్షుడు వెన్నం సోమిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు మంకాల సాయిమల్లు, వల్లముల వెంకటేశ్వర్లు, బండ కిరణ్, చల్ల మీనారెడ్డి, యాకూబ్ రెడ్డి, యాదిరెడ్డి, బుచ్చిరెడ్డి సురేష్, గణేష్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మురళీధర్

తొర్రూరు, అక్టోబరు 4 : లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు పట్టణంలోని లయన్స్ భవన్‌లో నిర్వహించిన వైద్యశిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మరో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మందిని ఆపరేషన్‌ల కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు ఉచితంగా ఏర్పాట్లు చేస్తున్నామని క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు చిదిరాల నవీన్ కుమార్, తమ్మి రమేష్, శంకర్, క్లబ్ సభ్యులు టి.విశ్వేశ్వర రావు, లక్ష్మీనర్సింహారావు, శారద, వేణుగోపాల్ రెడ్డి, శ్రీదేవి, కిరణ్ కుమార్, సరేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మణపల్లిలో మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బుడిగె సతీష్‌గౌడ్

మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నేత ఆర్థిక సాయం

గూడూరు, అక్టోబరు 4 : బ్రహ్మణపల్లికి చెందిన దొనికెల సుగుణమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్, గ్రామ పార్టీ నాయకులు ఆమె కుటుంబసభ్యులకు శుక్రవారం రూ.6 వేల ఆర్థిక సాయం అందించారు. మృతురాలి కుమారుడు కుమారస్వామిని పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు బత్తుల రామన్న, మాజీ సర్పంచ్ పూనెం యాకయ్య, భూపతి శ్రీను, మేరుగు మధు, మహ్మద్ ఆలీ, కారింగుల శ్రీను, గడ్డం హరికృష్ణ, దారావత్ కీర్యా, బాదావత్ వీరన్న, దేవేందర్, బబ్లా, సాయి, రోహిత్, అజయ్, హరీష్, పాల్గొన్నారు.

కల్వలను సందర్శించిన జడ్పీ సీఈవో

కేసముద్రం, అక్టోబరు 4 : మండలంలోని కల్వల ఆరోగ్య ఉప కేంద్రాన్ని జడ్పీ సీఈవో నర్మద శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని అభివృద్ధి పనులు, నర్సరీల పనితీరును అడిగి తెలుసుకున్న అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంపీడీవో ఉదయశ్రీ, ఎంపీవో హరిప్రసాద్, కార్యదర్శి అరుణ్‌జ్యోతి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యే

మహబూబాబాద్ , అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ కలిశారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికి చేరేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వఫలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.